క్లుప్తంగా

షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ: ఆరవ రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలికల జట్టు తృతీయస్థానం దక్కించుకుంది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో పోటీలు నిర్వహించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరు పతకాలతో పాటు ట్రోఫీకి నిర్వాహకుల నుంచి అందుకున్నారు. విజేతలను జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు రమణారెడ్డి, నరేష్‌బాబులు అభినందించారు.

నేడు పాశుపతరుద్ర హోమం

మదనపల్లె సిటీ: మాస శివరాత్రి పురస్కరించుకుని స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీయోగ భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాన్యాస పూర్వక మృత్యుంజయ పాశుపతరుద్రాభిషేకం, హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశేశ్వరప్రసాద్ తెలిపారు. సాయంత్రం జరిగే హోమాలకు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 6.30, 7.30 గంటలకు మల్లయ్యకొండకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఇవే బస్సులు తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు నడపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కలకడ : మండలంలోని దిగువతాండ, ఎగువ తాండ గ్రామాల్లో సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని అక్కడికి అక్కడే పరిష్కార చర్యలు తీసుకుంటారని తెలిపారు. అన్నిశాఖల అధికారులు, అందరు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సోమవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అర్చన, తోమాలసేవ, తదితర సేవా కార్యక్రమాల అనంతరం ఆస్థాన మండపంలో సీతారాముల కల్యాణం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు రూ.300 సేవా టికెట్‌ను కొనుగోలు చేసి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం పాతహరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎం.రెడ్డెయ్య(35) మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం ఉదయం మృతుని స్వగ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వం తరపునుంచి మృతుని కుటుంబానికి రావాల్సిన వైఎస్సార్ బీమా సదుపాయంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మృతుని కుటుంబానికి పరిహారం త్వరితగతిన అందేలా చూడాలని ఆదేశించారు. మృతుని అంత్యక్రియలకు గాను తన వంతుగా నగదు సహాయం అందజేశారు. అనంతరం మర్రికుంటపల్లి గ్రామం కడియాల వారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పి.లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆయనను పరామర్శించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

పీలేరు : హలో మాదిగ–చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఇన్‌చార్జ్ రాజు కోరారు. ఆదివారం పీలేరు మండలం జాండ్ల పంచాయతీ గుట్టకిందపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం విశ్వరూపం మహాసభను ఈనెల మూడవ వారంలో నిర్వహించడం జరుతుందని, అందరూ అల్గొని విజయవంతంచేయాలని కోరారు.

ఆరోగ్యమస్తు

పెద్దతిప్పసముద్రం: మోకాళ్ల నొప్పులు, కీళ్ళ నొప్పులు, దగ్గు, ఆయాసం బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక రోగులు కొందరు...దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్ళి చికిత్స పొందలేని వారు మరి కొంత మంది...ఇంటికే పరిమితమై బయట అడుగు పెట్టలేని స్థితిలో మరి కొంత మంది నిస్సహాయులు...ఇలాంటి వారి సమస్యలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెక్ పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందం 104 వాహనాల్లో వారి గడపల వద్దకే వెళ్లి రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ వైద్య సేవలందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో రవాణా ఖర్చులు, భోజనం ఖర్చులతో పాటు ఇబ్బందులు కూడా తప్పాయని గ్రామీణ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వయసు మీద పడిన ముసలి వాళ్ళు, మంచాలకే పరిమితమైన వారు, వికలాంగులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందం సభ్యులు ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇళ్ళ వద్దనే సేవలు అందిస్తున్నారు. 14 రకాల వివిధ పరీక్షలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళి విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులతో పాటు వారికి ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతతో పాటు జ్వరాలు ప్రబలే విధానం, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

మండలం	: పెద్దతిప్పసముద్రం
పంచాయతీల సంఖ్య	: 20
సచివాలయాలు	: 15
మండల జనాభా	: 50,079
పీహెచ్‌సీలు	: రెండు
104 వాహనం	: ఒకటి
సిబ్బంది	: ఏడుగురు
వైద్య పరీక్షలు చేసుకుంటున్న వారు రోజుకు	: 120 నుంచి 150 మంది



గ్రామాల్లో 104 సిబ్బంది


ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శంకర్

దేవుళ్ల రూపంలో వచ్చి వైద్య సేవలు


నా పేరు జాఫర్‌వలి. బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లి. బీపీ అధికమై పక్షపాతం సోకింది. మంచానికే పరిమితం అయ్యాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని మా లాంటి పేదల ఇళ్ల వద్దకే 104 ఫ్యామిలీ డాక్టర్లు దేవుళ్ల రూపంలో వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

-జాఫర్‌వలి, బడికాయలపల్లి, పెద్దతిప్పసముద్రం

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం


గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. సాధారణ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తున్నాం. టీబీ లక్షాలు ఉన్నవారిని గుర్తించి మందులు అందజేస్తున్నాము. రోజుకు సగటున 120 నుంచి 150 మందికి వైద్య సేవలు అందిస్తున్నాం.

-డాక్టర్ శంకర్, కందుకూరు పీహెచ్‌సీ, పెద్దతిప్పసముద్రం

నేడు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సమీక్ష

పెద్దతిప్పసముద్రం: తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సోమవారం పీటీఎంకు విచ్చేస్తారని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, అధికారులు తప్పక హాజరు కావాలని వారు సూచించారు.

వేలంలో రూ.3.82 లక్షల ఆదాయం

మదనపల్లె : టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రికార్డులు లేని ద్విచక్రవాహనాలకు నిర్వహించిన వేలంలో ప్రభుత్వానికి రూ.3.82 లక్షలు ఆదాయం సమకూరినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్‌చేసిన 38 వాహనాలకు నిర్వహించిన వేలంలో 34 వాహనాలను స్క్రాప్ కింద, రన్నింగ్ కండిషన్‌లో ఉన్న నాలుగు వాహనాలకు రవాణాశాఖ అధికారులు రూ.1,61,000 ప్రభుత్వ ధరను నిర్ణయించారన్నారు. వేలంలో పాటదారులు రూ.3,82,500కు కొనుగోలు చేశారన్నారు. దానికి 18శాతం జీఎస్టీ కింద రూ.68,850 అదనంగా వసూలుచేసి ఖజానాకు జమచేశామన్నారు. రన్నింగ్ కండీషన్‌లోని 4 వాహనాలను కొనుగోలు చేసిన వాహనదారులకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి

–ఐఎంఏ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ

పీలేరు : వైద్యులు, ఆసుపత్రులలోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలలో ఆదరణ పెరుగుతుందని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఏపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. ఆదివారం పీలేరులో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. భారతీయ వైద్యసంఘం ప్రపంచలోనే అతిపెద్ద వృత్తి సంఘమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 1750 శాఖలలో నాలుగురు వైద్యులు సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 98 శాఖలలో 20 వేల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వైద్య రంగంలో అభివృద్ధి, పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఫణిధర్, సంయుక్త కార్యదర్శులు ఏపీ సుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

పీలేరు ఐఎంఏ కార్యవర్గం ఎన్నిక :
ఆదివారం జరిగిన ఐఎంఏ నూతన కార్యవర్గంలో గౌరవ సలహాదారుగా డాక్టర్.ప్రసాద్, రాజాసాహెబ్, అధ్యక్షుడిగా డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శిగా పవన్, కోశాధికారిగా ఈశ్వర్‌సురేంద్ర, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ రూపేష్‌కుమార్‌రెడ్డి, యల్లయ్య ఎన్నియ్యారు.

అగ్ని కులక్షత్రియ యూత్‌ఫోర్స్ గౌరవ అధ్యక్షుడిగా బలరాం

పీలేరు: అగ్ని(వన్ని) కులక్షత్రియ యూత్ ఫోర్స్ రాయలసీమ ప్రాంత గౌరవ అధ్యక్షులుగా పీలేరు పట్టణానికి చెందిన బలరాంను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు నుంచి నియామకపత్రం అదుకున్నారు. ఆదివారం పీలేరులో ఈమేరకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమప్రాంతంలో నివాసం ఉండే అగ్నివన్నెకులక్షత్రియ, అలాగే పల్లెరెడ్డి, పల్లికాపు, వన్నెరెడ్డి, వన్నెకాపు, వన్నెకుల క్షత్రియులగా స్థిరపడిన వారికి కుల ధృవీకరణపత్రం మంజూరు చేసే సమయంలో సంఘం నాయకులను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

వాల్మీకిపురం: విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొనడంతో ప్రమాదవశాత్తూ మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలిన సంఘటన పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం తెల్లవారిజామున చోటు చేసుకొంది. వివరాలు.. బెంగళూరు నుంచి ఓ కుటుంబం కారులో తిరుపతికి బయల్దేరింది. ఆదివారం తెల్లవారిజాము 1:30 గంటలకు అనంతపురం నుంచి తిరుపతి జాతీయ రహదారిలోని స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని మలుపును దాటుతుండగా కారు చక్రం పేలడంతో ప్రమాదవశాత్తూ కారు అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో స్తంభం విరిగి నేల కూలిపోగా వెంటనే ఆ విద్యుత్ తీగలతోపాటు మరో రెండు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోయాయి. రోడ్డు పొడవునా విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. గమనించిన జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్, పోలీసులకు, విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయానికి భక్తుల విరాళం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి తిరుపతి పట్టణానికి చెందిన భక్తులు హేమశ్రీ, వెంకటరమణ దంపతులు రూ.30 వేలు విరాళంగా ఇచ్చారు. గత కొన్ని నెలలుగా రెడ్డెమ్మకొండలో గర్భాలయ నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఆదివారం ఆలయానికి చేరుకొన్న దాతలు ఆలయ ఈఓ మంజులకు నగదు మొత్తాన్ని విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాన్ని అందజేశారు. విరాళం మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేస్తామని ఈఓ తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఈఓ ధన్యవాదాలు తెలియజేశారు.


అమ్మవారికి విరాళం అందజేస్తున్న దాతలు

నిబంధనలకు అనుగుణంగా ఓటరు నమోదు

వాల్మీకిపురం: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగానే ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (ఈఆర్వో) గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన వాల్మీకిపురం పట్టణంలో జరగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా జాబితా ఆధారంగా ఆయన ఓటరు వెళ్లి సరి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదులో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది సుజాత, గణేష్, పాల్గొన్నారు.

జనహృదయాలను గెలిచిన గద్దర్

మదనపల్లె : పాట, మాట, ఆటతో జనహృదయాలను గెలిచిన గద్దర్ ఏ ఒక్క వర్గానికి, భావజాలానికి పరిమితం కాలేదని, చెప్పదలచుకున్న విషయాన్ని మనస్సుకు తాకేటట్లు చెప్పగల గొప్ప వాగ్గేయకారుడు గద్దర్ అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన(బాస్), వీసీకే పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జోహార్ గద్దరన్న సంతాప ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మిషన్‌కాంపౌండ్‌లో ర్యాలీని ఎమ్మెల్యే నవాజ్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. గద్దర్ వేషధారణలో పలువురు ఉద్యమకారులు డప్పులు, చెక్కభజనలతో గద్దర్ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. సబ్ కలెక్టరేట్, చిత్తూరుబస్టాండ్, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్ మీదుగా జీఆర్‌టీ హైస్కూల్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రజా యుద్ధనౌక, ప్రజావాగ్గేయకారుడు గద్దర్ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.... బడుగు, బలహీన వర్గాల విప్లవస్ఫూర్తి గద్దర్ అని, ఆయన మాట, పాట, జీవితం ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ జీవించే ఉంటాయని తెలిపారు. బాస్ వ్యవస్థాపకులు, వీసీకే పార్టీ రాష్ట్రనాయకులు పీటీఎం.శివప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, గుండ్లూరు రఫీ, మేస్త్రీ శ్రీనివాసులు, బావాజాన్, ఎల్ఐసీ.సుధాకర్, ఆర్‌జీఎస్.దివాకర్, ముత్యాలమోహన్, పోతబోలురెడ్డెప్ప, లక్ష్మీనారాయణ, మునివెంకటప్ప, గిన్నెలమనోహర్‌రెడ్డి, కె.వి.రమణ, బయన్న, నీరుగట్టి రమణ పాల్గొన్నారు.


మదనపల్లెలో గద్దర్ సంతాప ర్యాలీ

ప్రజలకు మంచిచేయడమే వైఎస్సార్ సీపీ విధానం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ప్రజలకు మంచిచేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం సాయంత్రం అగ్రహారం పంచాయతీలోని ఆరిపిరెడ్డిగారిపల్లె, పూలవాండ్లపల్లె గ్రామాల్లో సర్పంచ్ వి.ఉషారాణి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లారు. ప్రజల యోగక్షేమాలను విచారిస్తూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను విచారించారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సిమెంట్‌రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ కుసుమ, నాయకులు యుగంధరరెడ్డి, కైలాసపతి, దయాకర్‌రెడ్డి, ఉదయశేఖర్‌రెడ్డి, మౌలాలి, నరేంద్రరెడ్డి, సుధాకర, లక్ష్మీనారాయణ, వెంకటరమణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

గర్నిమిట్ట యల్లమ్మకు విశేష పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ యల్లమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళవాయిద్యాలతో బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజలకు చేరువయ్యేందుకే వార్డు నిద్ర

మదనపల్లె : పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వార్డు నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు శనివారం రాత్రి పట్టణంలోని ఇందిరానగర్‌లో వార్డు నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో బస చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ... సైబర్‌క్రైమ్ వలన జరిగే అనర్థాలను వివరిస్తూ..అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈవ్‌టీజింగ్, ఎక్కడైనా ఆకతాయిల ఆగడాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే తమకు తెలియపరచాలని, అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మిట్స్ విద్యార్థులకు ఐఎస్‌టీఈ అవార్డు

కురబలకోట: మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇద్దరికి రాష్ట్ర స్థాయిలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ–22) అవార్డులు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. యనమల తన్మయశ్రీకి బెస్ట్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ స్టూడెంట్ అవార్డు, ఎద్దుల పవిత్రకు బెస్ట్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ స్టూడెంట్ అవార్డు లభించినట్లు తెలిపారు.

(సాక్షి తెలుగు దినపత్రిక, రాయచోటి జోన్‌లో 12-08-2023న ప్రచురించబడిన "హెచ్చరిక ప్రకటన" శీర్షిక కు సమాధానం)

మా క్లయింట్లు శ్రీమతి వారణాసి భానురేఖ భర్త స్వర్గీయ V. తిరునాథరెడ్డి మరియు శ్రీమతి V. మౌళికరెడ్డి భర్త హర్షారెడ్డిలు శ్రీమతి V. దీప్తికా రెడ్డితో పాటు స్వర్గీయ V. తిరునాథరెడ్డి న్యాయవారసులు మరియు ఉత్తరాధికారులుగా ఉన్నారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. సదరు V. తిరునాథరెడ్డి మరియు అతని అన్న గారు V. విశ్వనాథరెడ్డి బోదుమళ్ళవారిపల్లె రెవెన్యూ గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లాలోని సర్వే నం.లు 686, 687/3, 689, 688, 696/2, 691/1, 691/3, 691/4, 690 మరియు 700/1, 700/2 మరియు 700/3 కలిగిన వ్యవసాయ భూమికి ఉత్తరాధికారులుగా మరియు యజమానులుగా ఉన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలైనా ఎదురుకాకుండా ఉండేందుకు వీలుగా SRO పీలేరు కార్యాలయంలో నమోదుకాబడిన డాక్యుమెంట్ నం. 584/2015 తేది. 25-03-2015 ప్రకారం పార్టీషన్ డీడ్ ద్వారా ఇరువురి మధ్య ఆస్తులు విభజించబడినవి. V. తిరునాథరెడ్డి మరణానంతరం శ్రీమతి V. దీప్తికారెడ్డితో పాటు మా క్లయింట్లు షెడ్యూలు B ఆస్తికి ఉత్తరాధికారులుగా ఉన్నారు.

బోదుమళ్ళవారిపల్లె రెవెన్యూ గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లాలోని సర్వే నం.లు 690, 689, 692/2, 696/2 మరియు 700/1లో ఉండి పార్టీషన్‌కి సంబంధించి షెడ్యూలు A మరియు B ఆస్తుల మధ్య కేటాయించబడిన ఉత్తరం నుండి దక్షిణానికి 30 అడుగుల వెడల్పు మరియు తూర్పు నుండి పశ్చిమానికి 925 అడుగుల పొడవు కొలతలతో ఎ.0.68 సెంట్ల విస్తీర్ణం కలిగి ఉండి 30 అడుగుల కామన్ రోడ్డుతో సహా చట్టవిరుద్ధమైన లేఅవుట్ ప్రాతిపదికపైన G. రమేష్‌కుమార్ రెడ్డి అనే అతనితో పాటు మా క్లయింట్లు ఒకరితో ఒకరు కుమ్మక్కై, వారి భూములను అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తప్పుడు మరియు నిరాధారమైన ఆరోపణల పైన వారి క్లయింట్ V. విశ్వనాథరెడ్డి తరపున M/s. K. సుధాకర్‌రెడ్డి, P. వెంకటరమణారెడ్డి మరియు N. దినకర, అడ్వకేట్స్ ద్వారా సాక్షి తెలుగు దినపత్రిక రాయచోటి జోన్‌లో 12-08-2023న "హెచ్చరిక ప్రకటన" ప్రచురించబడినదని మా క్లయింట్ల దృష్టికి వచ్చింది. దానికిగాను మా క్లయింట్లు షెడ్యూలు A మరియు B ఆస్తుల మధ్య కేటాయించిన 30 అడుగుల రోడ్డును అన్యాయంగా ఆక్రమించలేదని లేదా అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించలేదని మా క్లయింట్లు స్పష్టం చేస్తున్నారు మరియు ఉమ్మడి దారి (రోడ్డు)ను అభివృద్ధి చేయుటకు మా క్లయింట్స్‌కు అన్ని హక్కులు ఉన్నాయని మరియు V. విశ్వనాథరెడ్డి ఇచ్చిన మౌఖిక సమ్మతి ప్రకారం మా క్లయింట్స్ ఉమ్మడి దారి (రోడ్డు) ను అభివృద్ధి చేస్తున్నారని మరియు ఇద్దరికీ అది ఉపయోగకరంగా ఉంటుందని కానీ సదరు V. విశ్వనాథరెడ్డి గ్రామంలో గందరగోళం కలుగచేస్తూ తప్పుడు మరియు నిరాధారమైన ఆరోపణలు చేస్తూ "హెచ్చరిక ప్రకటన" ఇచ్చారు మరియు మా క్లయింట్స్ పేరు ప్రతిష్టలకు కూడా భంగం కలిగించారు. పరువు నష్టం కోసం సదరు V. విశ్వనాథరెడ్డి పైన క్రిమినల్ చర్య చేపట్టేందుకు మా క్లయింట్స్ తగిన చర్యలు చేపడుతున్నారు.

M/s. సయ్యద్ షబ్బీర్ హుస్సేన్, సయ్యద్ సమీర్, అడ్వకేట్స్
H.No.2-4-620, నెహ్రూనగర్, కాచిగూడ, హైదరాబాద్. ఫోన్ నం.9848996040

ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలి

కలికిరి: ప్రతి ఇంటా ఈ నెల 15వ తేదీ వరకు జాతీయ జెండా రెపరెపలాడాలని ఐటీబీపీ కమాండెంట్ అమిత్ భాటి అన్నారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పత్తేగడ గ్రామం పాఠశాలలో ఐటీబీపీ ఆధ్వర్యంలో ఇంటింటికి జాతీయ జెండా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశభక్తిని ఒక కర్తవ్యంలా స్వీకరించి చాటుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజు వరకు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఉండాలని సూచించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఐటీబీపీ అధికారులు, జవాన్‌లు పాల్గొన్నారు.

'క్షణికావేశాలతో నేరాలకు పాల్పడవద్దు'

గుర్రంకొండ: ప్రజలు క్షణికావేశాలతో నేరాలకు పాల్పడవద్దని ఎస్ఐ దిలీప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధరణ ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ప్రశాంత వారణానికి ఎవరు భంగం కలగించకుడదన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొంటే చట్టపరంగా శిక్ష తప్పదన్నారు. ఎక్కువగా నేరాలకు పాల్పడేవారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు.గ్రామాల్లో జూదం, కోడిపందెలాను ఎవరు కూడా ప్రోత్సహించకూడదన్నారు. గ్రామాల్లో గట్టినిఘా ఉంచామన్నారు. ఎవరైనా అనవసరమైన ఘర్షణలకు దిగితే చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్ గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ములకలచెరువు: మండలంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 1995–96 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఒకరి యోగక్షేమాలు మరోకరు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 27 సంవత్సరాల తర్వాత అందరు ఒకే చోట కలవడం సంతోషంగా ఉందన్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులైన వరదాచార్యులు, మల్లిలను సన్మానించారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: వారంతా ఎక్కడెక్కోడ స్థిరపడ్డారు. సుమారు 37 ఏళ్ల తరువాత అందరూ ఒక చోట కలుసుకున్నారు. తంబళ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనాన్ని మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులోని సూర్య టవర్స్‌లో ఆదివారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి హెచ్‌ఎం సిద్దారెడ్డి, ఉపాధ్యాయులు నారాయణ, కొండయ్య, వెంకటరమణ, రహమత్ జాన్‌లను ఘనంగా సన్మానించారు.